క్లుప్తంగా

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపాల్ ఏడుకొండలు

సంగం : సంగం ఐటీఐ కళాశాలలో ఫిట్టర్ విభాగంలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.ఏడుకొండలు సోమవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 27వ తేదీ ఉదయం 10 గంటలకు ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్యాంపస్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 98667 20544, 99639 50604, 63005 99477 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైభవం.. గంగాభవాని రథోత్సవం


ప్రత్యేక రథంపై ఊరేగుతున్న అమ్మవారు

వరికుంటపాడు : మండలంలోని గువ్వాడి గ్రామంలో కొలువైన గంగాభవాని అమ్మవారి జల్దికొలుపు మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంలో గ్రామంలోని వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ జల్దికొలుపు మహోత్సవం ఉప్పుటూరు ఆలా వంశస్తుల ఆధ్వర్యంలో గ్రామస్తుల సహాయ సహకారాలతో నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవరత్నాల లోగో ఉందని ఎమ్మెల్యే చిందులు

వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని గుండెమడకల పర్యటించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్థానిక హెల్త్ సెంటర్ మీద నవరత్నాల లోగో ఉండటాన్ని గమనించి అక్కడున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిబ్బంది ఆ విషయం మాకు తెలియదని, వైద్యాధికారికి చెప్పాలని కోరడంతో ఆయన ఫోన్‌లో వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసి తీవ్రంగా మందలించారు. మండలంలోని అన్ని హెల్త్ సెంటర్లలో నవరత్నాల లోగో తీసేసి ప్రధానమంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ఫొటోలు పెట్టాలని ఆదేశించారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వరికుంటపాడు : వరికుంటపాడు మండల పరిధిలోని కాకొల్లువారిపల్లి గ్రామంలో అంకాల పరమేశ్వరి జాతర మహోత్సవం సందర్భంగా సోమవారం రెండో రోజు ఎడ్ల బండలాగుడు పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. పోటీలో మూడు జతల ఎడ్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సూరారెడ్డి ఎడ్లు 2028.5 అడుగులు బండలాగి మొదటి స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ కడప జిల్లా, వల్లూరు మండలం, గోసురాయిపల్లి గ్రామానికి చెందిన పామిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎడ్లు 2004 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ కడప జిల్లా, చాపాడు మండలం, పెద్దచ్చిపాడు గ్రామానికి చెందిన మూల శివప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర శర్మ ఎడ్లు 1974.4 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీలను చూసేందుకు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఉదయగిరిలో తేలికపాటి వర్షం

ఉదయగిరి : అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉదయగిరి మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి, సోమవారం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయగిరిలో 38.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అక్కడక్కడ కురిసిన తేలికపాటి వర్షాలతో రైతులు బీడు భూములను దుక్కులు చేసుకునే ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు.

రాయల చెరువు.. నీరు కరువు

- పలుచోట్ల దెబ్బతిన్న తూములు, మరలు
- చెరువు దుస్థితిని పట్టించుకోండి సారూ


చుక్కనీరు లేని ఆత్మకూరు చెరువు

ఆత్మకూరు : ఆత్మకూరులో శ్రీకృష్ణ దేవరాయల నాటి మేజర్ చెరువు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దుస్థితికి చేరుకుంది. దానిపై దృష్టి సారించి చెరువును అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. సుమారు ఏడు వేల ఎకరాలకుపైగా (అధికార, అనధికార పారుదల) సాగునీరు అందించే ఈ చెరువు రాయలకాలం నాటిది. ఐదు శతాబ్దాలకు పైగా సాగునీరు అందిస్తున్న ఈ చెరువుకు ఘనమైన చరిత్రే ఉంది. ప్రతి ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతుండడంతో గతంలో వర్షంపై ఆధారపడిన చెరువుకు అనంతరం పలు ప్రభుత్వాలు సోమశిల జలాశయం నుంచి నీరు అందేలా ఏర్పాట్లు చేశారు. అయితే చెరువులో నీరు స్థిరంగా నిల్వ ఉండేలా పటిష్టమైన చర్యలు లేకపోవడంతో పలుచోట్ల లీకుల ద్వారా విలువైన సాగునీరు వృథా అవుతోంది. మొత్తం ఐదు తూముల ద్వారా పొలాలకు ఆత్మకూరు మేజర్ చెరువు నుంచి సాగునీరు సరఫరా అవుతోంది. కొన్ని పొలాలు ఇళ్ల స్థలాలుగా మారడంతో దానికి సంబంధించిన తూముల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. అయినా మిగిలిన పొలాలకు కరువు పరిస్థితుల్లో సజావుగా నీరు అందే స్థితి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మూడో నంబర్ తూము ద్వారా సుమారు 450 ఎకరాలు సాగునీరు అందాల్సి ఉంది. దీనికి నీరు విడుదల అయ్యేలా ఏర్పాటు చేసిన మరలు దెబ్బతినడం, సమీపంలోనే పెద్ద రంధ్రం ఏర్పడడంతో సాగునీరు వృథాగా వెలుపలకు పోతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. దీని గురించి సంబంధిత అధికారులకు తెలిపినా మరమ్మతులు చేయలేదని రైతులు అంటున్నారు.

చేపల పెంపకానికే ప్రాధాన్యత

ఆత్మకూరు చెరువుకు సంబంధించి వ్యవసాయానికి ప్రాధాన్యతను తగ్గించి చేపల పెంపకానికి ప్రాధాన్యం పెంచారని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. దీనికి కారణం పెంపకందారులు చేపలు పట్టేందుకు సాగునీటిని తూముల ద్వారా ఇష్టారాజ్యంగా వదిలేస్తున్నారు. దీంతో భవిష్యత్ అవసరాల కోసం నీటిని నిల్వ ఉంచకపోవడంతో పాటు సాగులో ఉన్న పైరుకు చివరి దశలో నీరు అందని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు చెరువు దుస్థితిని పరిశీలించాలని, పలుచోట్ల దెబ్బతిన్న కట్టను పటిష్టపరిచి మరమ్మతులకు గురైన తూములను సరిచేయాలని రైతులు కోరుతున్నారు. కాగా దీనిపై సాగునీటి సిబ్బందిని సంప్రదించగా నిధులు మంజూరైతే పరిశీలించి పనులు చేయిస్తామని పేర్కొన్నారు.


చెరువులో తూముల వద్ద వలలను ఏర్పాటు చేసిన చేపల పెంపకందారులు


చెరువు మూడో నంబర్ తూము వద్ద దెబ్బతిన్న మరలు

ప్రజా సమస్యలు గాలికి..

- మంత్రి వస్తున్నారని గ్రీవెన్స్‌కు డుమ్మా


తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఆత్మకూరురూరల్ : రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా సోమవారం ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో జరగాల్సిన గ్రీవెన్స్‌కు అన్నిశాఖల అధికారులు ఏకకాలంలో డుమ్మా కొట్టి ప్రజా సమస్యలను గాలికి వదిలేశారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులెవరూ హాజరుకాకపోవడంతో కార్యాలయం వెలవెలబోయింది. ఈ విషయమై సిబ్బందిని ఆరా తీయగా అన్నిశాఖల అధికారులు మంత్రి పర్యటనలో పాల్గొనడం వల్ల ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించలేకపోయామని పేర్కొనడం గమనార్హం.

నకిలీ విత్తనాలను విక్రయిస్తే లైసెన్సులు రద్దు


ఆత్మకూరులో ఎరువులు, విత్తన విక్రయ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ చెన్నారెడ్డి

ఆత్మకూరురూరల్ : నకిలీ విత్తనాలను విక్రయిస్తే దుకాణదారుల లైసెన్సులను రద్దు చేస్తామని ఉదయగిరి వ్యవసాయ శాఖ ఏడీఏ చెన్నారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలు, విత్తన విక్రయ కేంద్రాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. విత్తన విక్రయ కేంద్రాల్లో నిల్వలు, స్టాకు రిజిస్టర్ నిర్వహణ, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు తమ వద్ద ఉన్న నిల్వలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు విక్రయించిన ఉత్పత్తులకు సంబంధించి ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డులు పారదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు, మర్రిపాడు మండలాల వ్యవసాయ అధికారులు కిశోర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఐఈఏ దినోత్సవం


ఏఐఐఈఏ జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

ఆత్మకూరు : ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆత్మకూరు ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యాలయంపై జెండాను ఆవిష్కరించారు. ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్లతో పాటు అనేక సమస్యలను పరిష్కరించడంలో అసోసియేషన్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి ప్రభాకర్, సీఐటీయూ నాయకులు శివ ప్రసాద్, సాధిక్ హుస్సేన్, సంస్థ కార్యవర్గ సభ్యులు టి.రమేష్, రమాదేవి, సాయితేజ, నాగరాజు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయవ్యాధికి చెక్


వయోజనులకు టీకాలు వేస్తున్న సుశీలమ్మ

వరికుంటపాడు : అడల్ట్ బీసీజీ టీకాను వేసుకోవడం ద్వారా క్షయ వ్యాధికి చెక్ పెట్టవచ్చని వరికుంటపాడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ, పీహెచ్ఎన్ రాజశేఖరరాజు, సుశీలమ్మ అన్నారు. వరికుంటపాడు సచివాలయంలో జరిగిన టీకాల పంపిణీ కార్యక్రమాన్ని వారు సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని వయోజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ టీకాను వేసుకోవడం ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


ఆరవేడులో ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

ఆత్మకూరురూరల్ : మండలంలోని కరటంపాడు, ఆరవేడు, జంగాలపల్లి, కోనసముద్రం తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. పొదలకూరుకు చెందిన ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రజలకు తెలియజేశారు. ప్రతిఒక్కరూ భగవద్గీత పఠనం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య, సభ్యులు కృష్ణయ్య, పెంచలయ్య, శేషాద్రి, కిరణ్, గాయత్రి, జాహ్నవి, కిశోర్, మధు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం


ఆత్మకూరు రూరల్ : బట్టేపాడులో పింఛన్లను అందజేస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి


సీతారామపురంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సురేష్


కావలి: మర్రిచెట్టు సంఘం గిరిజనకాలనీలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి

ఆత్మకూరు : రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలో ఆయన కొందరికి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం పెరుమాళ్లపాడులోని ఆనం గార్డెన్స్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 65 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.4,408 కోట్లు అందజేసినట్లు తెలిపారు. మంగళవారం నాటికి నూరు శాతం పంపిణీ పూర్తవుతుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సిద్దీపురం గ్రామంలో ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించామన్నారు. అనంతరం ఏఎస్‌పేట, ఆత్మకూరు పట్టణం, రూరల్, చేజర్ల, అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఆత్మకూరు ఆర్డీఓ మధులత, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తాళ్లూరు గిరి నాయుడు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- ఆత్మకూరురూరల్ : మండలంలోని బట్టేపాడులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

ఉదయగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఆయన నియోజకవర్గంలోని ఉదయగిరి, జలదంకి, సీతారామపురం, దుత్తలూరు, కలిగిరి మండలాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను క్రమపద్ధతిలో అమలు చేస్తున్నట్లు తెలియజేశారు.

లబ్ధిదారుల్లో ఆనందం

కావలి : పెన్షన్ నగదు పెంచడంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అన్నారు. ముసునూరు 15వ వార్డు పరిధిలోని మర్రిచెట్టు సంఘం గిరిజన కాలనీలో, అల్లూరు మండలం సింగపేట పంచాయతీ చెలికసంఘం గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమవారం పాల్గొని, లబ్ధిదారులకు పెన్షన్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శీనానాయక్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెండోరోజు రక్తదాన శిబిరం

- మొత్తం 1,271 యూనిట్ల సేకరణ



కావలి : డాక్టర్స్ డే సందర్భంగా కావలి పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు నిర్వహించిన రక్తదాన శిబిరం సోమవారం కొనసాగింది. 61 మంది రక్తదానం చేశారు. ఆదివారం 1,210 యూనిట్ల రక్తం సేకరించగా, రెండోరోజు కలిపి మొత్తం 1,271 మంది రక్తదానం చేశారు. ఇది ఐఎంఏ చరిత్రలో అరుదైన రికార్డు అని కావలి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కామంచి సుబ్బారావు తెలియజేశారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, రాష్ట్ర కో–ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

వరికుంటపాడు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి కరిష్మా తెలియజేశారు. మండలంలోని గణేశ్వరపురం గ్రామంలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు సోకవన్నారు. ప్రభుత్వం అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకోవాలన్నారు. గర్భిణులు తమ వివరాలను ఏఎన్ఎం వద్ద నమోదు చేయించుకోవాలన్నారు.

నూతన ఆర్ఎంకు ఘన స్వాగతం


కావలి ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఆర్ఎం

కావలి : ఆర్టీసీ నెల్లూరు రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టడానికి విజయవాడ నుంచి నెల్లూరు వెళ్తున్న విజయరత్నంకు కావలి ఆర్టీసీ డిపో అధికారులు సోమవారం ఘన స్వాగతం పలికారు. నెల్లూరు వెళ్తూ ఆయన కొద్దిసేపు కావలిలో ఆగారు. డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కావలి బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామకృష్ణ, కార్గో సూపర్‌వైజర్ డి.రవిప్రకాష్, కంట్రోలర్ పి.జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు నగదు అందజేస్తున్న దాతలు, టీచర్లు

సంగం : పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను సోమవారం అందజేశారు. చల్లా ప్రభాకర్ యాదవ్, కిశోర్ యాదవ్ తమ తండ్రి జ్ఞాపకార్థం తరుణవాయి జెడ్పీ పాఠశాలలో సోమవారం నగదు ప్రోత్సాహకాలను అందించారు. ప్రథమ స్థానంలో నిలిచిన టి.మౌనికకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ప్రదీప్తికి రూ.3 వేలు, తృతీయస్థానం సాధించిన షేక్ ఆయేషాకు నగదును అందజేశారు. అనంతరం చల్లా ప్రభాకర్ యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. మాజీ సర్పంచ్ గుత్తా జ్యోతి హాజరై పాఠశాలకు మినరల్ వాటర్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ ఎస్.సురేష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డాక్టర్ లక్ష్మీనరసారెడ్డికి సత్కారం



కావలి : జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యుడు, రెడ్‌క్రాస్ భవన నిర్మాణ దాత డాక్టర్ చిల్లకూరు లక్ష్మీనరసారెడ్డిని రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ ప్రతినిధులు సోమవారం ఘనంగా సత్కరించారు. కావలి పట్టణంలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కావలి చైర్మన్ డి.రవిప్రకాష్ పాల్గొని, మాట్లాడారు. 97 సంవత్సరాల వయస్సులో ఇప్పటికీ డాక్టర్ సీఎల్ఎన్ రెడ్డి పేద ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించడమే కాకుండా కావలి రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్‌లకు అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు హరినారపరెడ్డి, ఒరుగంటి వెంకటేశ్వర్లు, రోటరీ ప్రముఖులు వెంకట సుబ్బయ్య, గోపీకృష్ణ, బీఎస్ ప్రసాద్, ఐ.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిమాన్యం భూములను కాపాడండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీలు

సీతారామపురం : సీతారామపురం గ్రామంలో ఉన్న వెట్టిమాన్యం భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డికి నలుగురు ఎస్సీలు విన్నవించుకున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో మా పెద్దలు వెట్టిచాకిరి చేస్తూ జీవించేవారని, వారికి ప్రభుత్వం సర్వే నంబర్ 536–1–2లో 2.84 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. ఇటీవల కాలంలో కొందరు కబ్జాదారులు, ఇతర జిల్లావాసులు ఆ వెట్టిమాన్యం భూమిపై కన్నేసి దొంగ రికార్డులు సృష్టించుకుని స్వాహా చేసేందుకు పన్నాగం వేశారన్నారు. ఆ భూమి అన్యాక్రాంతానికి గురికాకుండా కాపాడి ఎస్సీలకు న్యాయం చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తానన్నారు.

కొత్తూరులో రోడ్లకు మరమ్మతులు

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో సోమవారం అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపట్టారు. కొండబిట్రగుంట నుంచి వరవకట్ట మీదుగా కొత్తూరుకు వెళ్లే రోడ్డు చెట్లతో మూసుకుపోవడంతో గ్రామస్తులు ఈ సమస్యను ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చెట్లు తొలగించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.